పదేళ్ల కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే సతీమణి మర్రి మమతారెడ్డి



మాట్లాడుతున్న మర్రి మమతారెడ్డి

అల్వాల్: పదేళ్ల కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి సతీమణి మర్రి మమతారెడ్డి, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజిని అన్నారు. 136 డివిజన్ నేరేడ్‌మెట్‌లోని యాప్రాల్‌లో శోభక్క ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా కార్యకర్తల సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని, బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌనిక, నాయకులు ఉపేందర్‌రెడ్డి, శివకుమార్, మహిళా నాయకురాళ్లు రమాదేవి, రుబీనా, నవనీత, ఆర్తీ, ప్రమీల, పరిమళ, కాంత తదితరులు పాల్గొన్నారు.

మోదీ మనస్సులో మల్కాజిగిరికి ప్రత్యేక స్థానం

బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కుషాయిగూడ: ప్రధాని మోదీ మొదట ఎన్నికల శంఖారావం మొదలు పెట్టింది మల్కాజిగిరిలోనే.. మనం చూపిన ప్రేమ, ఆదరణకు ఆయన ముగ్ధులయ్యారు. మోదీ మనస్సులో మల్కాజిగిరికి ప్రత్యేక స్థానం లభించింది. అబ్ కీ బార్ చార్‌సౌ పార్ నినాదంలో మల్కాజిగిరి పార్లమెంట్‌ను ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం హెచ్‌బీకాలనీ, వెంకటేశ్వరనగర్‌లోని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్ ఇంట్లో పలు కులసంఘాలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో టిఫిన్ బైటక్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో బస్తీల్లో ఉన్నవారే ఓటింగ్‌లో ఎక్కువ శాతం పాల్గొనేవారని, ఈసారి గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్‌వాసులు, ఉద్యోగులు, విద్యావంతులు ఓటు వేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పెరిగే ఓటింగ్ శాతం పూర్తిగా మోదీకే వస్తుందన్నారు.

- టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చుకున్నప్పుడే తెలంగాణ ప్రజలతో బంధం తెగిపోయిందన్నారు. ఆ పార్టీకి ఓటు వేస్తే మురికి గుంతలో వేసినట్లే అన్నారు. ఇక కాంగ్రెస్ హామీల గురించి చెప్పాలంటే సమయం సరిపోదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారు కానీ కాంగ్రెస్ హామీలను చూసి కాదన్నారు.
- అప్పులకుప్పగా మారిన తెలంగాణ రాష్ట్ర పరిస్థితి తెలిసినా అధికార దాహంతో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు నేడు మాట్లాడుతున్న మాటలను గమనించాలన్నారు. రెండు లక్షల రుణమాఫీ లేదు. రూ.15 వేల రైతు బంధు దేవుడెరుగు ఇవ్వాల్సిన రూ.10 వేలకు దిక్కులేకుండా పోయిందన్నారు. తిరిగి మరోమారు మోసం చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధమవుతున్నాడన్నారు.
- 17 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే హామీలన్నీ అమలు చేస్తామంటున్నారు. 17 స్థానాలు గెలిచేది లేదు హామీలు అమలయ్యేది లేదన్న వాస్తవాన్ని ప్రజలు గమనించాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. అధికార దాహంతో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసపూరిత హామీలను తిప్పికొట్టాలన్నారు. మే 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, మాజీ ఎంటీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయకులు ఎనుముల మహేష్, బ్రహ్మచారి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ పార్కు, రవీంద్రనగర్ కాలనీలో బుధవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ కాలనీవాసులతో సమావేశం నిర్వహించి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పాటుపడాలన్నారు. నరేంద్రమోదీని మూడవసారి ప్రధానమంత్రి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిపడి పనిచేయాలని, మల్కాజిగిరిలో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కక్కిరేని హరీష్, ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, ప్రవీణ్, నాయకులు సంజయ్ పటేల్, సుమన్‌రావు, రాఘవరెడ్డి, సాయికిరణ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రఘుపతిగౌడ్, వెంకన్నగౌడ్, శేఖర్, పద్మ, గీత, పడతియా నాయక్, వెంకట్‌రెడ్డి, రమేష్‌నాయక్, సురేష్, భాస్కర్, శివ పాల్గొన్నారు.

సేవాభావం కలిగిన యువత సివిల్ సర్వీసెస్‌లోకి రావాలి



సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీని ప్రారంభిస్తున్న ప్రసాద్‌కుమార్

బోడుప్పల్: యువత దేశ సేవలో పాల్గొనడానికి సివిల్ సర్వీసెస్ అద్భుతమైన వేదికని తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఉప్పల్ డిపో వద్ద చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటైన సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత యువతను దృష్టిలో ఉంచుకుని ఐఏఎస్ అకాడమీని స్థాపించడం అభినందనీయమన్నారు. సివిల్స్ సర్వీసెస్ విద్యార్థులందరూ సేవాభావం కలిగి ఉండాలని ఆయన సూచించారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ఆయన సంభాషించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ ఆర్‌ఎస్‌రెడ్డి, నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలు పర్యావరణ హితం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం హర్షణీయమని, దీని వల్ల పర్యావరణానికి మేలు కలుగుతుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ వాహన తయారీ సంస్థ బజాజ్ తమ త్రీవీలర్(ఆటో) సెగ్మెంట్‌లో బజాజ్ రె ఇ–టెక్ 9.0 మోడల్‌ను మంగళవారం నగరంలో విడుదల చేసింది. ఈ సందర్భంగా బజాజ్ ఆటో లిమిటెడ్ మేనేజర్లు బాబ్జీనెల్లి, కె.వి.కుబేర్ మాట్లాడుతూ మార్కెట్‌లోకి విడుదల చేసిన కొత్త వాహనం విశిష్టతలను వివరించారు.

రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బోడుప్పల్: ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ వేడుకలు జరుపుకోవాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల మాసం క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, క్షమ, దయ, ఉపకారం, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు. రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

బోడుప్పల్: భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూగర్భ జలాలు అట్టడుగుకు వెళ్తున్న సందర్భంగా ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటి యజమాని, గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్ యజమానులు తమ సొంత ఇంట్లో వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని నిల్వ చేసుకునేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుని నీటి వనరులను కాపాడుకోవాలన్నారు. అంతా కలిసికట్టుగా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నీటి ఎద్దడి రాకుండా వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని నిల్వ చేసుకునేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వేసవి శిబిరాలకు దరఖాస్తులు చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మే 1 నుంచి 31 వరకు 14 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తి కలిగిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు తాము నిర్వహించాలనుకుంటున్న క్రీడలు, ప్రదేశాలు, గ్రామం పేరుతో సహా మొబైల్ నంబర్ తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఈ నెల 18 వరకు అందజేయాలని ఆయన కోరారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనంతో పాటు క్రీడా సామాగ్రి అందజేస్తామన్నారు.

మల్కాజిగిరి స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కుషాయిగూడ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్ నియోజకవర్గం కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య కార్యకర్తల సమావేశం చర్లపల్లిలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అంతా కలిసి పనిచేసి మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, పావనిరెడ్డి, సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, అంజిరెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాం రెడ్డి, పోలేపాక అంజయ్య, గడ్డం యాదగిరి, పత్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబితో మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యూనివర్సిటీ వీసీ, క్యాబి ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ బుధవారం సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్(క్యాబి)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ వీఎస్‌కే రెడ్డి, క్యాబి రీజనల్ డైరెక్టర్ వినోద్ పండిట్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందంతో వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్లాంట్వైజ్ ప్లస్ నాలెడ్జ్ బ్యాంక్, ఫ్యాక్ట్ షీట్ లైబ్రరీ ఆఫ్ క్యాబి బయోప్రొటెక్షన్ పోర్టల్ ద్వారా క్రాప్ స్ప్రేయర్ యాప్ ద్వారా అగ్రికల్చర్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు మరింత పరిజ్ఞానం పొందుతారని తెలిపారు. సమగ్ర సస్యరక్షణ విధానంపై రైతులకు విజ్ఞానాన్ని అందించి తద్వారా అధిక దిగుబడులకు, సుస్థిర వ్యవసాయానికి మరింత మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అగ్రి డిజిటల్ టూల్స్ కో ఆర్డినేటర్ మధు మంజరి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీలు వేశాం

- సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, తాగునీటి సరఫరా, పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్స్ సెర్ప్, డీఆర్‌డీఏ ద్వారా చేయించడం జరుగుతుందని తెలిపారు. ఎస్టిమేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, త్వరలో గ్రౌండింగ్ పూర్తవుతుందన్నారు. గుర్తించిన ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులు వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు అందించే వనరులను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఈవో విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రఘునాథస్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భర్తకు మద్దతుగా భార్య ప్రచారం



హెచ్‌బీకాలనీలో రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా భార్య రజని ప్రచారం

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా తన భార్య, కుమారుడు రాగిడి రజని, వెంకట్‌రియాన్‌రెడ్డి బుధవారం హెచ్‌బీకాలనీలో ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి రాజీవ్‌పార్కులో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్న వారిని కలిశారు. కారు గుర్తుకు ఓటు వేసి తన భర్తను గెలిపించాలని అభ్యర్థించారు. గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజాసేవలో ఉన్న తమకు ఎంపీగా అవకాశం కల్పించాలని కోరారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని దేవరయంజాల్ ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషన్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రిషియన్, సోలార్ టెక్నీషియన్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్/రిపేరింగ్ మొదలైన వాటిలో వృత్తి శిక్షణ ఇస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం లేదా ఫోన్: 79894 05049, 92902 17274.

నాచారం దక్కన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో రంజాన్ వేడుకలు





మల్లాపూర్: రంజాన్ సందర్భంగా నాచారం దక్కన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ఆటలు, పాటలు, డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్ష అనంతరం నెలవంక చూసిన తరువాత పవిత్ర రంజాన్ పండగను జరుపుకుంటారని తెలిపారు. రంజాన్ మనలో దయ, సహనం, ఇతరులకు సహాయం చేసే గుణాన్ని నేర్పుతుందన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింలకు దుస్తుల పంపిణీ



సైనిక్‌పురిలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

కాప్రా: పవిత్ర రంజాన్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. రంజాన్ సందర్భంగా సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉప్పల్ నియోజకవర్గంలోని మసీద్‌లకు ఇమామ్, మౌజమ్‌లకు స్పీకర్ చేతులమీదుగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో అత్యంత పవిత్రంగా ఉపవాస దీక్షలు చేసి నెలవంక చూసిన మరుసటి రోజు రంజాన్ పండగ జరుపుకోవడం వారి ఆనవాయితీ అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు ఎం.కె.బద్రోద్దీన్, నాయకులు రహీం, మహమూద్, నయీం, సలీం, కరీం పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సత్తి రాంచంద్రారెడ్డి

నిత్యావసర సరుకుల పంపిణీ

గౌతంనగర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మిర్జాలగూడకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు సత్తి రాంచంద్రారెడ్డి బుధవారం తన కార్యాలయంలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబుయాదవ్, మహ్మద్ మజీద్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లె గల్లా.. నిండేనా..?



- గ్రామ సీమల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు
- లక్ష్యం రూ.25.26 కోట్లు.. వసూలైంది రూ.23 కోట్లే..
- పన్నుల వసూళ్లలో ఘట్‌కేసర్ మండలం ఫస్ట్
- శామీర్‌పేట మండలానికి లాస్ట్ ప్లేస్
- ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లలో జాప్యం
- ఆశించిన స్థాయిలో వసూళ్లకు చర్యలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పల్లెసీమల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతేనే అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమవుతుందనేది వాస్తవం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌ఎసీ నిధులతో పాటు ఇంటిపన్ను కీలకంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఏటా జిల్లా అధికారులు ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నుల వసూళ్లను వంద శాతం చేపట్టాలని ఆదేశిస్తుండటం చేస్తుంటారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటారు. 2023–24లోనూ జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు తంటాలు పడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఈ క్రమంలో ఏ మేరకు లక్ష్యం చేరుకుంటారో అనే సందిగ్ధంలో పన్నుల వసూళ్లు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతోంది. పన్నుల వసూళ్ల విషయంలో ప్రజలపై ఒత్తిడి పెంచితే.. ఏవిధమైన ఇబ్బందులు ఎదురవుతాయన్న భయం కూడా పంచాయతీ ఉద్యోగులను వెంటాడుతోంది. ఇదిలా ఉండగా, పన్నుల వసూళ్లలో ఇంకా జాప్యం జరిగితే.. గ్రామాల అభివృద్ధి కుంటుపడటంతో పాటు పంచాయతీ సిబ్బందికి జీతభత్యాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కార్యక్రమాలపై పెను ప్రభావం పడగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పన్నుల వసూళ్లు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 61గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.25.26 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.23 కోట్లు(91.03 శాతం) మాత్రమే వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం(మార్చి 31) ముగిసి, పది రోజులు గడిచినా రూ.2.26 కోట్ల పన్నులు మిగిలి ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అత్యధికంగా ఘట్‌కేసర్ మండలం పరిధిలోని 11 గ్రామ పంచాయతీల్లో రూ.7.69 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యానికి, ఇప్పటి వరకు 7.22 కోట్లు(93.88 శాతం) వసూలు చేశారు. అత్యల్పంగా శామీర్‌పేట మండలంలో రూ.4.21కోట్లకు గానూ ఇప్పటి వరకు రూ.3.60కోట్లు(85.61శాతం) వసూలయ్యాయి. అలాగే, కీసర మండలం పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.3.67 కోట్లకు గానూ, రూ.3.35 కోట్లు(91.39శాతం), మేడ్చల్ మండలం పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో రూ.7.53 కోట్లకు గానూ, రూ.6.83 కోట్లు(90.80శాతం) వసూలయ్యాయి. మూడుచింతలపల్లి మండలం పరిధిలోని 13 గ్రామ పంచాయతీల్లో రూ.2.14 కోట్లకు గానూ, ఇప్పటి వరకు రూ.1.96 కోట్లు(91.68శాతం) పన్నులు వసూలయ్యాయి.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మిగిలిన పన్ను రూ.2.26 కోట్ల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. కొందరు అధికారులు గడిచిన రెండు నెలల నుంచే ముందస్తుగా వసూళ్లు ప్రారంభించడంతో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌తోనే పన్నుల వసూళ్లు సాధ్యమైనట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే బకాయిలు అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలపై అధికారులను అప్రమత్తం చేస్తున్న జిల్లా పంచాయతీ శాఖ ఎంపీఓలు, కార్యదర్శులు, సిబ్బంది కూడా రోజు వారి పన్నుల వసూళ్ల కార్యాచరణతో ముందుకు సాగేలా చర్యలు చేపడుతోంది.

ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా నివారణ చర్యలు చేపట్టాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో జాతీయ కార్యక్రమంలో భాగంగా 'వాతావరణ మార్పు–మానవ ఆరోగ్యం' అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వడదెబ్బ నివారణ చర్యల్లో భాగంగా పలు కార్యక్రమాల నిర్వహణలో జిల్లా వైద్య, విద్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశు సంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వడదెబ్బకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలి వేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి, తాగునీటి కేంద్రాలు, చలివేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రఘునాథస్వామి, డీఆర్‌డీఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.